క్లుప్తంగా

నేడు చీమకుర్తిలో విద్యుత్ అదాలత్

పొదిలి రూరల్: విజయవాడ సీజీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం చీమకుర్తిలో విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు దర్శి ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసులు తెలిపారు. చీమకుర్తి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.50 గంటల వరకు విద్యుత్ అదాలత్ సాగుతుందన్నారు. కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ చైర్మన్ జస్టిస్ ఎస్.విక్టర్ ఇమ్మానుయేల్, ఇతర ఫోరం సభ్యులు, ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. దర్శి డివిజన్ పరిధిలోని చీమకుర్తి, పొదిలి, దొనకొండ, కొనకనమిట్ల, మర్రిపూడి, దర్శి, తాళ్లూరు, ముండ్లమూరు, కురిచేడు మండలాల విద్యుత్ వినియోగదారులు తమ ఫిర్యాదులను రాతపూర్వకంగా తెలియజేసి పరిష్కరించుకోవాలని సూచించారు.

విద్యార్థులు ధ్యానంపై శ్రద్ధ చూపాలి


ధ్యానం గురించి వివరిస్తున్న నారాయణరెడ్డి

గిద్దలూరు రూరల్: విద్యార్థులు ధ్యానంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురువు బీఎస్ నారాయణరెడ్డి సూచించారు. అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం సందర్భంగా మండలంలోని ముండ్లపాడు గ్రామంలో గంజి భద్రయ్య జిల్లా పరిషత్ఉన్నత పాఠశాల ఆవణలో శుక్రవారం విద్యార్థులకు ధ్యానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 21వ తేదీన ఐక్యరాజ్యసమితిలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు గురూజీ రవిశంకర్ ధ్యానం చేయించే కార్యక్రమం ఉంటుందన్నారు. ధ్యానంతో కలిగే ప్రయోజనాల గురించి విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొంచెం ఇష్టం.. కొంచెం కష్టం!

- టెన్త్ విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు 100 రోజుల ప్రణాళిక
- సాధ్యాసాధ్యాలు పరిశీలించకుండా ప్రణాళిక ఇవ్వడంపై టీచర్ల అయిష్టత
- పలు పాఠశాలల్లో విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు
- పశ్చిమ ప్రకాశంలోని 21 మండలాల్లో 15,610 మంది టెన్త్ విద్యార్థులు



మార్కాపురం: పదో తరగతి పరీక్షల షెడ్యూల్ ఇటీవలే విడుదలైంది. విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 100 రోజుల ప్రణాళిక అమలుపై ఓవైపు ఉపాధ్యాయులు మల్లగుల్లాలు పడుతున్నారు. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై కొన్ని ఉపాధ్యాయ సంఘాలు బహిరంగంగానే తమ వాణి వినిపించాయి. పరీక్షల ప్రణాళికలో మార్పులు చేయాలని విజ్ఞప్తి చేసినా విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి హామీ లభించలేదు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో అదే ప్రణాళికను ఉపాధ్యాయులు అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

పశ్చిమ ప్రకాశంతోపాటు మార్కాపురం డీవైఈఓ పరిధిలోని కనిగిరి నియోజకవర్గంలో కూడా పదో తరగతి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేందుకు విద్యాశాఖాధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. మార్కాపురం డీవైఈఓ పరిధిలోని 21 మండలాల్లో 15,610 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్నారు. 2025 మార్చి 17 నుంచి 10వ తరగతి పరీక్షలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం పలు పాఠశాలల్లో స్టడీ అవర్లు నిర్వహిస్తున్నారు. కొందరు విద్యార్థులను దత్తత తీసుకుని వెనుకబడిన సబ్జెక్టుల్లో అర్థం కాని అంశాలను ప్రత్యేకంగా బోధిస్తున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు స్టడీ అవర్ నిర్వహించడంతోపాటు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఉదయం చదివిన సబ్జెక్టులపై పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక ప్రణాళిక ఎలాంటి ఫలితాలు ఇస్తుందో టెన్త్ పరీక్షల తర్వాత తేలనుంది.

రోజూ హాజరయ్యేలా చూస్తున్నాం



10వ తరగతి విద్యార్థులు రోజూ పాఠశాలకు హాజరయ్యేలా చూస్తున్నాం. ఇందులో భాగంగా తల్లిదండ్రులతో మాట్లాడుతున్నాం. తల్లిదండ్రులు కూడా మాకు సహకరించి పిల్లలను రోజూ పాఠశాలకు వచ్చే విధంగా సహకరించాలి. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించాం. ఇంటివద్ద చేసేలా స్పెషల్ హోమ్ వర్క్ కూడా ఇస్తున్నాం.

– ఓవీ వీరారెడ్డి, టీచర్, జెడ్పీ బాయ్స్ మార్కాపురం

మండలం	పరీక్ష రాయనున్న విద్యార్థులు
అర్ధవీడు	440
బేస్తవారపేట	510
సీఎస్ పురం	370
కంభం	1,240
గిద్దలూరు	1,310
హెచ్ఎంపాడు	300
కనిగిరి	1,500
కొనకనమిట్ల	640
కొమరోలు	500
మార్కాపురం	2,220
తర్లుపాడు	360
దోర్నాల	600
పామూరు	760
పీసీపల్లి	250
పెద్దారవీడు	630
పొదిలి	950
పుల్లలచెరువు	410
రాచర్ల	440
త్రిపురాంతకం	810
వెలిగండ్ల	420
వై.పాలెం	950
మొత్తం	15,640

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



మార్కాపురం డివిజన్లో పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఇందులో భాగంగా రోజూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు స్టడీ అవర్ నిర్వహిస్తున్నాం. పాఠశాలలో విద్యార్థి ఉండే సమయాన్ని నాలుగు సెషన్లుగా విభజించి బోధిస్తున్నాం. వారిలో ఉన్న లోపాలను సవరించేందుకు పరీక్షలు పెడుతున్నాం. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల చదువుపై దృష్టిపెట్టాలి.

– శామ్యూల్ జాన్, మార్కాపురం డీవైఈఓ

విద్యార్థుల దత్తత



చదువులో వెనుకబడిన విద్యార్థులను మా ఉపాధ్యాయులు దత్తత తీసుకున్నారు. వారి చదువుపై దృష్టిసారించారు. ఇంటికి వెళ్లి విద్యార్థి చదువుపై తల్లిదండ్రులతో మాట్లాడుతున్నారు. ప్రత్యేక క్లాసులు కూడా నిర్వహిస్తున్నాం. ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తున్నాం. రాష్ట్ర స్థాయిలో రాణించేందుకు కృషి చేస్తున్నాం.

– చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్ఎం, మార్కాపురం జెడ్పీ బాయ్స్ హైస్కూల్

స్పెషల్ క్లాసులతో ఉపయోగం



రోజూ స్పెషల్ క్లాసులు నిర్వహించడం వలన ఉపయోగంగా ఉంది. ఉదయం చదివిన సబ్జెక్టునే సాయంత్రం పరీక్ష పెట్టడం వలన మాలో లోపాలు తెలుస్తున్నాయి. రాష్ట్ర స్థాయిలో మంచి ర్యాంకు సాధించేందుకు కష్టపడి చదువుతున్నా.

– శ్రీహర్ష, టెన్త్ క్లాసు స్టూడెంట్

మా పాఠశాలకు మంచి పేరు తెస్తా



తెల్లవారుజామునే లేచి ఇంట్లో చదువుతున్నా. పాఠశాలలో స్టడీ అవర్‌కు అటెండ్ అవుతున్నా. ఎక్కువ మార్కులు సాధించి మా పాఠశాలకు మంచి పేరును తెస్తా. మా హెచ్ఎం చంద్రశేఖరరెడ్డి, ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, వీరారెడ్డి సార్లు మాకు బాగా సహకరిస్తున్నారు.

– ఎ.శ్రీనివాసులు, పదో తరగతి స్టూడెంట్

ఆర్టీసీలో కార్గో డోర్ డెలివరీ


మాట్లాడుతున్న డీఎం నరసింహులు

మార్కాపురం టౌన్: రాష్ట్రంలోని 80 ప్రధాన నగరాలు, పట్టణాల్లో ఆర్టీసీ పార్శిల్, కొరియర్ సర్వీసును ఏర్పాటు చేసిందని, ప్రజలు ఉపయోగించుకోవాలని డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు కోరారు. శుక్రవారం డిపో వద్ద నిర్వహించిన సమావేశంలో డీఎం మాట్లాడారు. పార్శిల్ కౌంటర్ నుంచి 10 కిలోమీటర్ల పరిధిలో డోర్ డెలివరీ సేవలు కూడా అందిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు ఉపయోగించుకోవాలని కోరారు. కార్గో హోమ్ డెలివరీపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.

త్వరితగతిన గృహాలు నిర్మించుకోవాలి


లబ్ధిదారుతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

కొమరోలు: ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలు త్వరితగతిన నిర్మించుకోవాలని ఎంపీడీఓ మస్తాన్‌వలి తెలిపారు. మండలంలోని బ్రాహ్మణపల్లె ఎస్సీకాలనీలో లేఅవుట్‌ను హౌసింగ్ ఏఈ కృష్ణారెడ్డితో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గృహ లబ్ధిదారులతో ఎంపీడీఓ మాట్లాడారు. నిర్మాణాలు వేగంగా పూర్తి చేసుకుంటే త్వరితగతిన బిల్లులు పొందవచ్చని చెప్పారు.

వీఆర్వో సంఘ అధ్యక్షుడిగా బాల వెంకటరెడ్డి


ఎన్నికైన వీఆర్వోల సంఘ నాయకులు

పొదిలి రూరల్: పొదిలి మండల గ్రామ రెవెన్యూ అధికారుల(వీఆర్వో) సంఘం ఏకగ్రీవంగా ఎన్నికైంది. శుక్రవారం పొదిలిలో నిర్వహించిన సమావేశంలో అందరి అమోదంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా యెనుముల బాల వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులుగా కేవీ అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా వి.యాకోబు, సంయుక్త కార్యదర్శిగా పి.కిన్నెర, కోశాధికారిగా ఎస్‌సీటీ నారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బాలవెంకటరెడ్డి మాట్లాడుతూ వీఆర్వోల సమస్యల పరిష్కారానికి మండల కమిటీ కట్టుబడి ఉంటుందని పేర్కొన్నారు. ఐకమత్యంగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో మండలంలోని వీఆర్వోలు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ


బైక్‌పై హెల్మెట్ ధరించి ర్యాలీలో పాల్గొన్న డీఎస్పీ, సీఐ తదితరులు

మార్కాపురం: టూవీలర్‌పై వెళ్లే ప్రతి ఒక్కరూ కచ్చితంగా హెల్మెట్ ధరించాలని డీఎస్పీ నాగరాజు సూచించారు. శుక్రవారం పట్టణ పోలీసు స్టేషన్ నుంచి 4 మండపాల్లో హెల్మెట్ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బైక్‌పై ప్రయాణించే సమయంలో పొరపాటున రోడ్డు ప్రమాదం సంభవిస్తే హెల్మెట్‌తో ప్రాణానికి రక్షణ లభిస్తుందని చెప్పారు. లైసెన్సు కలిగి ఉంటేనే వాహనం నడపాలని సూచించారు. సీఐ సుబ్బారావు మాట్లాడుతూ.. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే జరిమానా విధించడంతోపాటు లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై అహరూన్, వన్ టౌన్, టూటౌన్ ఎస్సైలు సైదుబాబు, డాక్టర్ రాజమోహన్‌రావు, రూరల్ ఎస్సై అంకమరావు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ సభకు 10 అర్జీలు

గిద్దలూరు రూరల్: గిద్దలూరు మండలం గడికోట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామ రెవెన్యూ సభలో వివిధ సమస్యలపై 10 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి తెలిపారు. అర్జీల పరిష్కారం కోసం కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ భాస్కర్‌రావు, వీఆర్ఓలు వి.వి.రమణ, వెంకటేశ్వర్లు, అచ్చయ్య, ఈశ్వర్‌రెడ్డి, సర్వేయర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

పేదల పెన్నిధి వైఎస్ జగన్


కేక్ కటింగ్ అనంతరం మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, పక్కన షంషేర్, ఇస్మాయిల్ తదితరులు

- వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలి
- మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు అన్నా రాంబాబు, కేపీ నాగార్జునరెడ్డి పిలుపు
- సేవా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం

మార్కాపురం రూరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను మార్కాపురం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం మార్కాపురంలోని పార్టీ కార్యాలయంలో కౌన్సిలర్లు, పార్టీ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందస్తుగా వైఎస్ జగన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి వైఎస్ జగన్ కృషి చేశారని, పార్టీలు, కులమతాలతో సంబంధం లేకుండా అర్హులందరికీ పథకాలు అందించారని కొనియాడారు. శనివారం నియోజకవర్గ వ్యాప్తంగా అన్నీ గ్రామాల్లో, పట్టణాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ షంషేర్ ఆలీబేగ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, వైస్ చైర్మన్ 2 అంజమ్మ శ్రీనివాసులు, పీఎల్‌పీ యాదవ్, కౌన్సిలర్లు బుశెట్టి నాగేశ్వరరావు, కరీముల్లా, కొత్త కృష్ణ, చంద్ర, సిరాజ్, రోజ్‌లిడియా, ముంగమూరి శ్రీను, కోఆప్షన్ సభ్యులు అమీరుల్లాఖాన్, గుంటక చెన్నారెడ్డి, పార్టీ నాయకులు డాక్టర్‌మక్బుల్ బాషా, జవ్వాజి రంగారెడ్డి బట్టగిరి తిరుపతిరెడ్డి, పత్తి రవిచంద్ర, నాసర్‌వలి, కరీంసా, కరీంబాషా, గౌస్ మొహిద్దీన్, రంగయ్య, కొండలు, రఘుపతి శివ, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురంలో..

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో గడియార స్తంభం వద్ద శనివారం ఉదయం 9.30 గంటలకు వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు తెలిపారు. భారీ కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం మార్కాపురం జీజీహెచ్‌లో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్నామని, నియోజకవర్గ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, శ్రేయోభిలాషులు హాజరుకావాలని కోరారు.

తర్లుపాడులో..

తర్లుపాడు: మండల పార్టీ నాయకుల ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటలకు తర్లుపాడు బస్టాండ్ సెంటరులో వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కంభంలో..

కంభం: స్థానిక కందులాపురం కూడలిలోని వైఎస్సార్ విగ్రహం సమీపంలో వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొంగటి చెన్నారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటలకు నిర్వహించే కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

హిందువులు ఐకమత్యంతో మెలగాలి


పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

గిద్దలూరు రూరల్: హిందువులు ఐకమత్యంతో మెలగాల్సిన అవసరం ఉందని ఆర్ఎస్ఎస్ ఖండ కార్యవాహ పంట శివమల్లారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని పట్టాభిరామస్వామి ఆలయంలో హైందవ శంఖారావంపై శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 5వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. హిందువుల అలసత్వం కారణంగా ఉనికిని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అనంతరం పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు పిడత రమేష్ రెడ్డి, విశ్వ హిందూ పరిషత్ నాయకుడు ఆసూలాల్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులు తెలుసుకోవాలి


మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

గిద్దలూరు రూరల్: వినియోగదారులు తమ హక్కుల గురించి తెలుసుకోవాలని ఎంఈఓ జింకా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. జాతీయ వినియోగదారుల అవగాహన కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల వద్ద నుంచి రైల్వేస్టేషన్, వైఎస్సార్ సెంటర్, చిన్నమార్కెట్ మీదుగా శుక్రవారం విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. ఎంఈఓ మాట్లాడుతూ.. వస్తువుల నాణ్యతా ప్రమాణాలను పరిశీలించిన తర్వాతే కొనుగోలు చేయాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ కావడి వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగభూషన్‌రెడ్డి, ఉపాధ్యాయులు భారతి, శోభన్‌బాబు, ఉషారాణి, వినియోగదారుల సంఘ అధ్యక్షుడు వీరారెడ్డి, కార్యదర్శి తోట వెంకటేశ్వరరావు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బీఎస్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లీటరు నాటుసారా స్వాధీనం


నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ సిబ్బంది

గిద్దలూరు రూరల్: మండలంలోని వెంకటాపురం గ్రామంలో శుక్రవారం ఓ వ్యక్తిని అరెస్టు చేసి లీటరు నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎక్సైజ్ సీఐ జయరావు తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయించినా, నాటు సారా తయారు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఒరిగిన విద్యుత్ స్తంభాలు



బాదినేనిపల్లె వెళ్లే దారిలో ఒరిగిన విద్యుత్ స్తంభాలు

కొమరోలు: వ్యవసాయ పొలాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయినప్పటికీ విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని గోపాలునిపల్లె నుండి బాదినేనిపల్లె గ్రామానికి వెళ్లే రహదారిలో వ్యవసాయ పొలాల్లో రహదారి పక్కన ఉన్న వ్యవసాయ విద్యుత్ లైన్లకు సంబంధించిన ఐదారు స్తంభాలు వరుసగా ఒరిగిపోయాయి. దీంతో స్తంభాలు ఎప్పుడు కూలి పడతాయోనని వాహనదారులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం సంభవించి ప్రాణనష్టం జరగక ముందే విద్యుత్ స్తంభాలను సరిచేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రవికుమార్‌కు అభినందనలు


రవికుమార్ యాదవ్

అర్ధవీడు: వైఎస్సార్ సీపీ జిల్లా పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడిగా ఎంపికైన అర్ధవీడు మాజీ ఎంపీపీ నన్నెబోయిన రవికుమార్ యాదవ్‌ను పలువురు నాయకులు శుక్రవారం అభినందించారు. కాగా తనపై నమ్మకంతో పార్టీ పదవి అప్పగించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డికి రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.